క్లుప్తంగా

కాలుష్యం నుంచి ప్రజలను రక్షించాలి



భిక్కనూరు: ఎంఎస్‌ఎన్ ఫ్యాక్టరీ వ్యర్థాల నుంచి వెలువడే కాలుష్యం నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి 43 రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వృథాగా పోతున్న నీటిని అరికట్టేదెవరు?



పెద్దకొడప్‌గల్: మండలంలోని విఠల్‌వాడి తండాలో తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదు. బోరు మోటార్‌కు ఉన్న స్విచ్ ఆఫ్ చేయక పోవడంతో రోజంతా నీరు వృథాగా పోయినట్లు స్థానికులు వెల్లడించారు. నీరు వృథాగా పోకుండా గ్రామంలో మినీ ట్యాంకులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

టీజీవోలో చేరిన అధ్యాపకులు



కామారెడ్డి అర్బన్: జిల్లాలో కొత్తగా రెగ్యులర్ అయిన జూనియర్ కళాశాలలకు చెందిన పలువురు అధ్యాపకులు మంగళవారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో)లో చేరారు. ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం ఆధ్వర్యంలో టీజీవోలో చేరినట్లు సంఘం బాధ్యులు సయ్యద్ జబీ, వసంత్, ఇష్రత్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య శేషారావు, ప్రతాప్ కిరణ్, రాజు, సంతోష్, మల్లన్న పాల్గొన్నారు.

టేకు చెట్లు మాయం



ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్ అటవీ ప్రాంతంలో టేకు చెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. ఎల్లారెడ్డి- కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన లక్ష్మాపూర్ అటవీ ప్రాంతంలోని మొసళ్లకుంట వద్ద రాత్రి పూట చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదు.

భారతీయ మరాఠా మహా సంఘ్ ఏర్పాటు



కామారెడ్డి అర్బన్: భారతీయ మరాఠా మహా సంఘ్ జాతీయ, రాష్ట్ర నాయకులు మంగళవారం కామారెడ్డిలో సమావేశమై జిల్లాలో సంఘం ఏర్పాటు, కార్యక్రమాల విస్తరణపై చర్చించారు. సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు గార్గే శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజానంద్ దేశ్‌ముఖ్, సంపర్క్ ప్రముఖ్ సుదేష్ పాటిల్, కోశాధికారి విఠల్‌రావు పాటిల్, ఆర్య క్షత్రీయ సంఘం జిల్లా కార్యదర్శి వజీర్ శివాజీరావు, రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వాలి



మాచారెడ్డి: రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయాధికారి రమ్యశ్రీ దుకాణదారులకు సూచించారు. మంగళవారం మాచారెడ్డి, గజ్యానాయక్ తండాలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింట తిరిగి విత్తనాలు విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయొద్దని రైతులకు సూచించారు.

538 మందికి కంటి పరీక్ష

కామారెడ్డి టౌన్: జిల్లాలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 538 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,49,576 మందికి పరీక్షలు నిర్వహించి 65,846 మందికి కంటి అద్దాలను అందించారు.

పల్లెకు పదివేల మొక్కలు!

- తొమ్మిదో విడత హరితహారానికి సన్నద్ధం
- 19న మాస్ ప్లాంటేషన్ కోసం ఏర్పాట్లు
- ఉపాధి కూలీల ద్వారా గుంతల తవ్వకం

కామారెడ్డి రూరల్: తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 19న అన్ని గ్రామాల్లో మాస్ ప్లాంటేషన్ పేరిట 1.40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా ప్రణాళికను సిద్ధం చేశారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ఉపాధిహామీ కూలీలతో యుద్ధ ప్రాతిపదికన తవ్విస్తున్నారు. కామారెడ్డి మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఒక్కో నర్సరీలో పది వేల మొక్కల చొప్పున పెంచుతున్నారు. వీటితోపాటు గతంలో పెంచిన 30 వేల మొక్కలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. నాటిన అనంతరం కొన్ని కారణాల వల్ల మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటేందుకు అదనపు మొక్కలు అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.



నర్సన్నపల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు.

పండ్ల మొక్కలు సిద్ధం



నర్సరీలో ప్రధానంగా పండ్లు, నీడనిచ్చే మొక్కలు సిద్ధంగా ఉంచాం. వేసవికాలంలో నర్సరీల్లోని మొక్కలు ఎండి పోకుండా కూలీలతో రోజూ నీళ్లు పోయిస్తున్నాం. ఎండల నుంచి సంరక్షణకు నర్సరీలపై గ్రీన్‌షేడ్ నెట్లను ఏర్పాటు చేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న 50 వేల మొక్కలస్థానంలో కొత్తవి పెంచుతున్నాం. – మలహరి, ఎంపీవో, కామారెడ్డి

కొలతల ప్రకారం కూలి చెల్లింపు



పల్లెబోగుడతండాలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రఘు

నాగిరెడ్డిపేట: మండలంలోని పల్లెబోగుడతండా, బొల్లారం గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. కొలతలకు అనుగుణంగా పనులు చేయాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ పర్వీనా ఉన్నారు.



రాజుల్లాలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బిచ్కుంద: ఉపాధి హామీ కూలీలకు కొలతలు ప్రకారమే కూలి చెల్లిస్తామని ఎంపీడీవో ఆనంద్ పేర్కొన్నారు. మండలంలోని రాజుల్లాలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలందరికీ పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

11న ఊరడమ్మ పండుగ

కామారెడ్డి రూరల్: గర్గుల్ గ్రామంలో 11న ఊరడమ్మ పండుగ నిర్వహించనున్నట్లు సర్పంచ్ చింతల రవితేజ గౌడ్ తెలిపారు. నిర్వహణపై స్థానికులతో ఆయన సమావేశమై చర్చించారు.



సమావేశమైన సర్పంచ్, గ్రామస్తులు

ఓటరు కార్డుల్లో తప్పులుంటే సరిదిద్దాలి



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

బీబీపేట: ఓటరు గుర్తింపు కార్డుల్లో పేర్లు, ఇంటి అడ్రస్‌లో తప్పులుంటే సరిదిద్దాలని తహసీల్దార్ నర్సింలు బీఎల్‌వోలకు సూచించారు. తప్పులను సరిదిద్దేందుకు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరించాలని పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 వరకు బీఎల్‌వోలు ఇంటింట సర్వే నిర్వహిస్తారని, మరణించిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోరు బావులు



ప్రొసీడింగ్ ప్రతులను అందజేస్తున్న ఎమ్మెల్యే

పిట్లం(జుక్కల్): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి విద్యుత్ కనెక్షన్‌లతో పాటు నూతనంగా బోరు బావులు తవ్విస్తామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఈ మేరకు పలువురు లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే ప్రొసీడింగ్ ప్రతులను అందజేశారు. పిట్లంలో ఏడుగురు, గౌరారంలో తొమ్మిది మంది, చిల్లర్గిలో నలుగురు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



బడి బాట ర్యాలీలో పాల్గొన్న నస్రుల్లాబాద్ ఎంపీపీ పాల్త్య విఠల్

సాక్షి, నెట్‌వర్క్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే మధ్యాహ్నం భోజనంతో పాటు పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఉచితంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్ పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని వడ్లం గ్రామం, లింగంపేట మండలంలో ఎంఈవో రామస్వామి, పిట్లం మండలం బొల్లక్‌పల్లి, బొగ్గులకుంట తాండ, గౌరారం తండా, రాంపూర్, చిల్లర్గి, బండపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింట సర్వే నిర్వహించారు. అదేవిధంగా బిచ్కుంద మండలం శాంతాపూర్, బిచ్కుంద, మాన్యాపూర్, గుండెనెమ్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో రాములు, సదాశివనగర్ మండల కేంద్రంతో పాటు మర్కల్, తిర్మన్‌పల్లి, మల్లుపేట్, పద్మాజివాడి, కుప్రియాల్ గ్రామాల్లో ఎంఈవో యోసెఫ్, ఉపాధ్యాయులు పాల్గొని పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు.



శెట్పల్లిసంగారెడ్డిలో సర్వే చేస్తున్న టీచర్లు



వడ్లం గ్రామంలో..



మర్కల్‌లో..



పిట్లంలో..



బిచ్కుందలో..

చెరుకు రైతుల అభివృద్ధికి కృషి

దోమకొండ: చెరుకు రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య అన్నారు. మంగళవారం స్థానిక పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మన్, కార్యదర్శి సత్యం, ప్రతినిధులు నర్సింలు, నాగారపు రాజు, కడారి రమేష్, కొండ్ల శ్రీను, నాగారపు ఎల్లయ్య, పురుషోత్తం, రాజనర్సు, గాలయ్య, నల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సీడీసీ చైర్మన్ నర్సయ్యను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

బెల్ట్ షాపులకు వేలం వేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ పోతిరెడ్డి

భిక్కనూరు: బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం వేస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పోతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జంగంపల్లి వీడీసీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో బెల్ట్ షాపు నిర్వహించేందుకు వీలుగా వేలం వేస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింట తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. 9న నిర్వహించనున్న సమావేశానికి లబ్ధిదారులు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మైశాగౌడ్, నర్సింలు గౌడ్, ఇమ్రాన్, ఏఎస్‌ఎం వెంకట లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు గౌరమ్మ, గంగమణి, ఆశా వర్కర్ లావణ్య పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ



బాన్సువాడ: సబ్సిడీపై ఎల్‌ఈడీ బల్బులను మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్ మంగళవారం పంపిణీ చేశారు. టీఎస్‌రెడ్‌కో సహకారంతో సీ క్యూస్ట్ క్యాపిటల్ ఎస్‌జీ ఇండియా, నిర్మల ఎంటప్రైజెస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో సబ్సిడీ పంపిస్తున్న ఎల్‌ఈడీ బల్బులను ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని సూచించారు. విద్యుత్ బిల్లును చూపిస్తే ఒక్కో ఎల్‌ఈడీ బల్బు సబ్సిడీపై రూ.25లకు ఇస్తామని తెలిపారు.

ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడ : ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోస్క సాయిప్రసాద్, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, కుమ్మరి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ మంజూర్, కోశాధికారిగా బస్వంత్, సంయుక్త కార్యదర్శులుగా సంగ్రాంసింగ్, హాశం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జీవన్, సలహాదారులుగా సయ్యద్ మెహ్రాన్, రెడ్డి పర్వన్న, సభ్యులుగా జైపాల్, మైత్రి సాయి లును ఎన్నుకున్నారు. అక్షరం, ఆరోగ్యం, అభివృద్ధి అనే అంశాలపై ఫౌండేషన్ పని చేస్తుందని వెల్లడించారు.



ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు

విచారణ సరే.. చర్యలేవీ?

నాగిరెడ్డిపేట: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలు వాయిదాల రూపంలో చెల్లించిన డబ్బులు నొక్కేసిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా సెర్ప్ అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. రుణాల చెల్లించిన డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా కొంత మంది సెర్ప్ సిబ్బంది నొక్కేశారు. తీసుకున్న రుణాలకు, చెల్లించిన డబ్బులకు సంబంధించి వ్యత్యాసం ఉండడంతో సిబ్బంది చేసిన మోసం బయటపడింది. మండలంలోని కిచ్చన్నపేట గ్రామంలో గల మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించిన డబ్బులను వాయిదాల ప్రకారం స్థానిక సీసీతో పాటు సీఏకు ఇచ్చారు. ఈ విషయమై జిల్లా డీపీఎం రవీందర్‌రావు, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ గతనెల 11 నుంచి 15 వరకు మహిళా సంఘ సభ్యుల సమక్షంలో విచారణ జరిపారు. 28 మంది సభ్యులకు సంబంధించి రూ. 1.48 లక్షలు పక్కదారి పట్టినట్లుగా అధికారులు విచారణలో తేల్చారు. ఇందుకు బాధ్యులైన వారిని గుర్తించినా వారి నుంచి వసూలు చేయడంలో నిర్ల క్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నా యి. తాము చెల్లించిన డబ్బులను బాధ్యుల నుంచి వసూలు చేసి ఇవ్వాలని కిచ్చన్నపేటకు చెందిన దివిటి ప్రమీల, మాదోసు అనసూజ, కుమ్మరి నాగమణి తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకొని సంఘ సభ్యులకు న్యాయం చేస్తామని వెల్లడించారు.



కిచ్చన్నపేటలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

లీగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



దోమకొండ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లీగ్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి దోమకొండకు చెందిన హమ్మద్ రయాన్, శ్రీనివాస్ ఎంపికైనట్లు గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ తెలిపారు. లీగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఐపీఎల్ లాంటి టోర్నమెంట్‌లో ఆడే అవకాశం లభిస్తుందన్నారు. క్రికెట్ శిక్షకులు రామకృష్ణ, ట్రస్టు ప్రతినిధులు గణేష్, శ్రీకాంత్ క్రీడాకారులను అభినందించారు.

ఆధ్యాత్మికం

■ వైభవంగా సింధూర పూజలు





రామారెడ్డి: ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో మంగళవారం సింధూర పూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఆలయ ఈవో ప్రభుగుప్తా, అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకష్ణశర్మ, జూనియర్ అసిసెంట్ సురేందర్, సహాయకులు నాగరాజు పాల్గొన్నారు.

■ సామూహిక కుంకుమార్చన

బీబీపేట: మండలంలోని మాందాపూర్ గ్రామం రేణుకాదేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు రాకేష్ శర్మ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కల్కి ఆలయంలో..

కామారెడ్డి అర్బన్: శ్రీకల్కి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు హైదరాబాద్‌కు చెందిన కైలాశ్వర్ మోక్ష, సంహితలు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సిద్ధంశెట్టి శ్రీనివాస్, చంద్రశేఖర్, బాలు, రజని, స్వరూపలు, జ్యోతి, శ్రావణి, విజయ్, బాల్‌నారాయణ పాల్గొన్నారు.

■ ఘనంగా సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం



మాచారెడ్డి: మండలంలోని సోమారంపేటలో బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదంబ మాతకు వొడిబియ్యం, బోగ్ బండార్ తదితర కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

సంక్షిప్తం..

ప్రభుత్వ పథకాలపై చిత్రలేఖన పోటీలు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరి గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి 9న బహుమతులు అందజేస్తామని తెలిపారు. అధ్యాపకులు భాస్కర్‌రాజు, బాలరాజు, విఠల్,పురుషోత్తం, వెంకట్రావ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖ సమావేశానికి హాజరు కావాలి

లింగంపేట: మండల కేంద్రంలో బుధవారం నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ సూచించారు. సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరవుతారని ఆయన వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెంకటాపూర్, భిక్కనూర్ గ్రామాలలో వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. చికిత్స అనంతరం అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

పెద్ద శక్కర్గాలో..

మద్నూర్: మండలంలోని పెద్ద శక్కర్గాలో మంగళవారం పశుసంవర్ధక శాఖ, పశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ బాబుపటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువుల్లో గర్భకోశ వ్యాధులు, దూడల ప్రదర్శన, కృత్రిమ గర్భదారణ గురించి మేనూర్ పశువైద్యుడు బండి విజయ్ పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర బస్వరాజ్, పండరి, అనిల్, రైతులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లు, బోనాల ప్రదర్శన

నిజాంసాగర్: మండలంలోని మంగ్లూర్ గ్రామంలో నల్లపోచమ్మ, ముత్యాల పోచమ్మ ఉత్సవాల్లో బాగంగా మంగళవారం ఎడ్ల బండ్లు, బోనాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గైని స్వప్న, నాయకులు గైని రమేష్, లక్ష్మారెడ్డి, దత్తు, అనిల్, సాయిలు, ఆగమయ్య పాల్గొన్నారు.



పండ్ల మొక్కల పెంపకం

బీబీపేట: మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ టీచర్ సురేఖ పండ్ల మొక్కలను నాటారు.

